నమస్తే తెలంగాణ
నిర్మల్
5 | నిజామాబాద్, శనివారం 3 ఫిబ్రవరి 2024 | NIRMAL

నాగోబా జాతర ఏర్పాట్లను పరిశీలించిన సీఎస్

ఇంద్రవెల్లి, ఫిబ్రవరి 2 : నాగోబా జాతర ఏర్పాట్లను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి పరిశీలించారు. శుక్రవారం మండలంలోని నాగోబా ఆలయాన్ని సందర్శించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మెస్రం వంశీయుల ఆధ్వర్యంలో ఆమెను శాలువాతో సన్మానించారు. ఆలయం నుంచి గోవాడ్ వరకు పర్యటించారు. జాతర ఉత్సవాల తోపాటు సంస్కృతీ సంప్రదాయాల గురించి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మెస్రం వంశీయులు శేఖర్ బాబు, ఆనంద్‌రావ్ పాల్గొన్నారు.

నాగోబా జాతర ఏర్పాట్లను పరిశీలిస్తున్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి



అమరవీరుల కుటుంబ సభ్యులకు ఇళ్లస్థలాల పట్టాలను అందించిన సీఎం రేవంత్‌రెడ్డి

ప్రాజెక్టులు నిర్మిస్తాం.. సస్యశ్యామలం చేస్తాం

పేరుకే పునర్నిర్మాణ సభ

- ఆదిలాబాద్ జిల్లాను దత్తత తీసుకుంటాం
- తెలంగాణ పునర్నిర్మాణ సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

ఇంద్రవెల్లి/ఉట్నూర్, ఫిబ్రవరి 2 : ప్రాజెక్టులు నిర్మించి ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలంలో శుక్రవారం నిర్వహించిన తెలంగాణ పునర్నిర్మాణ సభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉట్నూర్ సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో రూ.38.20 కోట్లతో చేపడుతున్న రోడ్లు, భవనాలు, అమరవీరుల స్మృతివనం పనులకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు సీతక్క, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావ్, కొండా సురేఖ, శాసన మండలి సభ్యులు వెంకటేశ్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బోజ్జుపటేల్‌తో కలిసి సీఎం శంకుస్థాపన చేశారు. ముఖ్యమంత్రి మాట్లాడుతూ ఆదిలాబాద్ జిల్లాను దత్తత తీసుకొని అభివృద్ధి చేస్తామన్నారు. తుమ్మిడి హెట్టి వద్ద మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అనుమతితో కుప్టి, సదర్మాట్ ప్రాజెక్టులను నిర్మిస్తామని, కడెం ప్రాజెక్టుకు మరమ్మతులు చేయిస్తామన్నారు. ఆ నాడు ఇంద్రవెల్లిలో ప్రతిజ్ఞ చేశామని, ఈనాడు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించుకున్నామన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో ఆదివాసీల ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు కృషి చేయాలన్నారు. ఐటీడీఏ ద్వారా గిరిజన ఆవాసాలకు రూ. 27 కోట్లతో రహదారులు, వంతెనలు, రూ. 5 కోట్లతో నేరడిగోండ మండలం బుగ్గారంలో గిరిజన బాలికల గురుకుల పాఠశాల భవనం, అమరవీరుల స్తూపం వద్ద రూ.కోటితో స్మృతి వనం నిర్మిస్తామన్నారు. ఖానాపూర్, ఆసిఫాబాద్ నియోజకవర్గాల్లో రూ. 60 కోట్లతో నీటి శుద్ధి కేంద్రం పనులు చేపడుతున్నామన్నారు. అమరవీరుల 15 కుటుంబాలకు ముత్నూర్‌లో ఇంటి స్థలం, ఇండ్లు పంపిణీ చేయడం జరిగిందని పేర్కొన్నారు.

మహిళలు ఆత్మగౌరవంతో బతకాలి

మహిళలు ఆత్మగౌరవంతో బతకాలన్నదే తమ ధ్యేయమని సీఎం అన్నారు. నాగోబా దర్బార్ హాల్‌లో మహిళా స్వయం సహాయక సంఘాలతో సీఎం ముఖాముఖీ నిర్వహించారు. అనంతరం గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో 1450 డ్వాక్రా సంఘాలకు సుమారు రూ. 60 కోట్ల రుణాలు బ్యాంక్ లింకేజీ కింద పంపిణీ చేశారు. త్వరలో గ్యాస్ సిలిండర్లను త్వరలోనే రూ. 500కే అందిస్తామని, 200ల యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్ సరఫరా చేస్తామన్నారు. కెస్లాపూర్ నాగోబా ఆలయంలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు రూ. 7 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. అనంతరం నాగోబా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. స్టాళ్లను పరిశీలించారు. ప్రభుత్వ ప్రధానకార్యదర్శి శాంతికుమారి, కలెక్టర్ రాహుల్‌రాజ్, ఎస్పీ గౌస్ అలం, ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో ఖుష్బుగుప్తా, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

గిరిజనుల కోసం ప్రత్యేక పథకాలు ఏం లేవు..

- పాత కథే చెప్పి వెళ్లిపోయిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- సీఎం హోదాలో ప్రసంగించకుండా విమర్శలకే ప్రాధాన్యం
- కేసీఆర్ సర్కార్ ఇచ్చిన స్టాఫ్ నర్సుల ఉద్యోగాలు కాంగ్రెస్ ఖాతాలో వేసుకునే ప్రయత్నం
- ఆశతో ఎదురుచూసిన జనానికి మిగిలింది నిరాశే..

బహిరంగ సభలో జనం లేక ఖాళీగా కనిపిస్తున్న సభా ప్రాంగణం

బహిరంగ సభలో మాట్లాడుతున్న సీఎం రేవంత్ రెడ్డి

మంచిర్యాల ప్రతినిధి, ఫిబ్రవరి 2(నమస్తే తెలంగాణ) : తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక నిర్వహించిన తొలి సభ జనాలకు నిరాశే మిగిల్చింది. తెలంగాణ పునర్నిర్మాణ సభ పేరిట ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలంలో నిర్వహించిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు రెండు గ్యారెంటీల అమలును ప్రకటిస్తారని అంతా భావించారు. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ నుంచి, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క నుంచి ప్రకటనలు కూడా వెలువడ్డాయి. దీంతో కాంగ్రెస్ నిర్వహించే మొట్టమొదటి సభపై ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ఆరు గ్యారెంటీలతోపాటు మరెన్నో హామీలిచ్చి అధికారంలోకి వచ్చాక సీఎం తొలిసభ పెట్టడం, ఎంపీ ఎన్నికలకు శంఖారావం పూరిస్తారనే ప్రచారం జరగడంతో కచ్చితంగా ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో రెండింటినైనా అమలు చేస్తారనుకున్నారు. కానీ.. సీఎం రేవంత్‌రెడ్డి మాత్రం త్వరలో రూ.500 గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పథకాలను ప్రారంభిస్తామని చెప్పి వదిలేశారు. ఆ రూ.500ల సిలిండర్ అమలు కూడా ప్రియాంకాగాంధీ రాష్ట్రానికి వచ్చి చేస్తారని చెప్పడంతో ఇప్పట్లో ఆ పథకం అమలులోకి వస్తుందా? రాదా? ఈ రెండు పథకాలకు సంబంధించి ఓ తేదీనైనా ప్రకటిస్తే బాగుండనే గుసుగుసలు వినిపించారు. తెలంగాణ పునర్నిర్మాణం అనే పేరుతో పెట్టిన సభలో రాబోయే రోజుల్లో తెలంగాణ రాష్ట్రం కోసం చేయాల్సిన పనులపై, అమలు చేసే కార్యక్రమాలపై స్పష్టత లేకుండా కేవలం విమర్శలకే సీఎం రేవంత్ ప్రాధాన్యం ఇచ్చారు. సీఎం హోదాలో ఆయన ప్రసంగం సాగలేదని, చాలా పేలవంగా ఉందనే టాక్ వినిపించింది. 15 వేల కానిస్టేబుల్ ఉద్యోగాలను 15 రోజుల్లో భర్తీ చేస్తామని చెప్తూనే ఆయన కోర్టు కేసులను గత ప్రభుత్వం పట్టించుకోలేదని ప్రస్తావించడంతో ఇందులోనూ ఏదో మెలిక ఉందనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి.

ఆదివాసీ, గిరిజనులకు రిక్తహస్తాలే..

రేవంత్‌రెడ్డి టీపీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టాక తొలి సభను ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లిలో నిర్వహించారు. ఆ సెంటిమెంట్‌తోనే అధికారంలోకి వచ్చాక తొలి సభను ఇక్కడే నిర్వహించారు. దీంతో ఆదివాసీ గిరిజనులు ఎక్కువగా ఉన్న జిల్లాలో వారి కోసం ప్రత్యేకంగా ఏదైనా పథకం ప్రకటిస్తారని అంతా అనుకున్నారు. కానీ.. తాగునీళ్లు, రోడ్లు, అభివృద్ధి పనులు చేస్తామని మాత్రమే సీఎం చెప్పారు. ఆదిలాబాద్ జిల్లాను ప్రభుత్వం దత్తత తీసుకుంటుందని చెప్పారే తప్ప ప్రత్యేకంగా ఎలాంటి అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలు అమలు చేస్తామనే స్పష్టత ఇవ్వకపోవడంతో జనంలో గందరగోళం నెలకొంది. నీటి పారుదల ప్రాజెక్టులు పూర్తి చేస్తామని చెప్పినప్పటికీ.. వాటికి ఇచ్చే నిధులు, ఎప్పుడు పనులు ప్రారంభిస్తామనే అంశాలను ప్రస్తావించలేదు. కేసీఆర్ సర్కార్ ఉద్యోగాలు భర్తీ చేస్తే, రేవంత్‌రెడ్డి సీఎం హోదాలో వారికి నియామక పత్రాలు ఇచ్చారనేది జగమెరిగిన సత్యం. అయినప్పటికీ రెండు లక్షల ఉద్యోగాల్లో ఏడు వేల స్టాఫ్‌నర్సుల ఉద్యోగాలు చేర్చిన సీఎం ఇంకా లక్షా తొంబైవేల పోస్టులు మాత్రమే భర్తీ చేయాల్సి ఉందంటూ సిగ్గులేకుండా ప్రకటించారు. స్థానిక ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు 317 జీవో ఉద్యోగుల విషయంలో స్పష్టత ఇవ్వాలని, పోడు భూములు పంపిణీ చేయాలని, ఐటీడీఏలో వివిధ సంక్షేమ పథకాలను అమలు చేయాలని కోరినప్పటికీ.. సీఎం రేవంత్‌రెడ్డి ఆ డిమాండ్లను అసలు పరిగణలోకే తీసుకోకపోవడం గమనార్హం.

గంట ఆలస్యం.. జనం అసహనం..

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సభ షెడ్యూల్ ప్రకారం మధ్యాహ్నం 3.50కి మొదలుకావాల్సి ఉండగా.. సీఎం సభకు వచ్చే సరికి 4.50 అయ్యింది. సీఎంను చూసేందుకు ఉమ్మడి ఆదిలాబాద్ నుంచి వివిధ ప్రాంతాల నుంచి జనం రాక మధ్యాహ్నం 12 గంటల నుంచే మొదలైంది. ట్రాఫిక్ సమస్యతో పోలీసులు దూరంగా వాహనాలు నిలిపివేయగా కిలోమీటర్ల కొద్ది జనం నడుచుకుంటూ సభకు వచ్చారు. మధ్యాహ్నం 2 గంటలకు సభకు జనం వచ్చేటప్పటికే ఎండ తీవ్రత పెరిగింది. సీఎం రాక ఆలస్యమవడం, దూరం నుంచి నడిచిరావడంతో జనం దాహంతో అల్లాడి పోయారు. నీటి సరఫరా లేక, సభ ప్రాంగణంలో నీడ లేక మండే ఎండలో మాడిపోయారు. రేవంత్‌రెడ్డి ఆలస్యంతో సభలో మిగిలిన నాయకులను మాట్లాడించారు. అలా ఒక్కో నాయకుడి ప్రసంగానికి ముందు, ప్రసంగం అయ్యాక జనం వాటర్, వాటర్ అంటూ గట్టిగా అరిచారు. వాటర్ లేదని తెప్పిస్తున్నామని నాయకులు చెప్పినప్పటికీ.. తాగునీరు అందలేదు. దీంతో చాలా ఇబ్బందులు ఎదుర్కొంటూ ప్రజలు సీఎం కోసం ఎదురు చూశారు. కొందరైతే దాహానికి తట్టుకోలేక బయటికి వెళ్లి మంచినీళ్లు తాగి వచ్చారు. ఒక ప్లానింగ్ లేకుండా హడావుడిగా సభ నిర్వహించి ఇబ్బందులు పెట్టడంపై జనం అసహనానికి గురయ్యారు.

బహిరంగ సభలో ఎండకు ఫ్లెక్సీ కప్పుకున్న జనం

సభలో నీళ్లు కావాలని బాటిల్ చూపిస్తున్న యువకులు

సీఎంకు కుమ్రం భీం చిత్రపటం బహూకరిస్తున్న ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

బహిరంగ సభలో ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, సభా వేదికపై మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు

మాట తప్పిన రేవంత్

- డిసెంబర్ 9 నుంచే పథకాలను అందిస్తామన్నాడు..
- ఇప్పుడు ఎంపీ స్థానాలను గెలిపిస్తేనే ఇస్తామనడం విడ్డూరం
- బీఆర్ఎస్ పార్టీకి ఉన్న కమిట్‌మెంట్ కాంగ్రెస్ పార్టీకి లేదు..
- ఆదిలాబాద్ గులాబీ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి రామన్న

మాజీ మంత్రి జోగు రామన్నను సన్మానిస్తున్న కాలనీ వాసులు

ఎదులాపురం, ఫిబ్రవరి 2 : గత డిసెంబర్ 9వ తేదీ నుంచి సంక్షేమ పథకాలను అమలు చేస్తామని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి.. ఇప్పుడు మాట మార్చి పార్లమెంట్ స్థానాలను గెలిపిస్తేనే ఇస్తామనడం విడ్డూరంగా ఉందని ఆదిలాబాద్ బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి రామన్న విమర్శించారు. ఆదిలాబాద్ పట్టణంలోని మహాలక్ష్మి వాడలో గల భవాని గార్డెన్‌లో నిర్వహించిన వార్డు కమిటీ సమావేశానికి హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాయమాటలు చెప్పి రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిందని, రెండు నెలల పాలనను చూసిన తర్వాత ప్రజలు ఎవరు నమ్మే స్థితిలో లేరని మండిపడ్డారు. బీఆర్ఎస్ పార్టీకి ఉన్న కమిట్‌మెంట్ కాంగ్రెస్ పార్టీకి లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణ ఉనికిని చాటుకునే అవసరం ఉందని, ఎంపీ స్థానాల గెలుపే లక్ష్యంగా బీఆర్ఎస్ కమిటీలు పని చేయాలని దిశానిర్దేశం చేశారు. కేసీఆర్ ప్రభుత్వం 1.18 లక్షల ప్రైవేటు ఉద్యోగాలతోపాటు ఆలయాల నిర్మాణం, చర్చిలు, మసీదులు నిర్మించిందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జాహీర్ రంజానీ, పట్టణ అధ్యక్షుడు అజయ్, మైనార్టీ అధ్యక్షుడు సలీం పాషా, బీసీ సెల్ అధ్యక్షుడు దాసరి రమేశ్, మహిళా సంఘం పట్టణ కార్యదర్శి బోడగం మమత, కౌన్సిలర్లు సంద నర్సింగ్, పందిరి భూమన్న, నాయకులు సంజయ్, కొమ్ర రాజు, గోలి శంకర్, సాయి పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న భారతి లక్పతి నాయక్

హాజరైన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అధికారులు

తప్పులు లేకుండా ఓటరు జాబితా రూపొందించాలి..

- నిర్మల్ కలెక్టరేట్‌లో నాలుగు జిల్లాల అధికారులతో భేటీ
- సీప్ కార్యక్రమాలపై విస్తృత అవగాహన కల్పించాలి..
- ప్రభుత్వ సంస్థల ప్రత్యేక కార్యదర్శి భారతి లక్పతి నాయక్

నిర్మల్ టౌన్, ఫిబ్రవరి 2 : పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని తప్పులు లేకుండా ఓటరు జాబితాను సమగ్రంగా రూపొందించాలని ప్రభుత్వ సంస్థల ప్రత్యేక కార్యదర్శి, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి భారతి లక్పతినాయక్ సూచించారు. జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో నిర్మల్, ఆదిలాబాద్, కుమ్రం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, రెవెన్యూ అధికారులతో సమగ్ర ఓటరు జాబితాపై సమీక్ష నిర్వహించారు. మొదటగా నిర్మల్‌కు చేరుకున్న కలెక్టర్‌కు అటవీశాఖ గెస్టుహౌజ్ వద్ద కలెక్టర్ పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలో సమగ్ర ఓటరు జాబితా కసరత్తు, ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లు, స్వీప్ కార్యక్రమాలపై ఆయా జిల్లాల కలెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. ఇప్పటికే అన్ని జిల్లాల్లో పార్లమెంట్ ఎన్నికల సమగ్ర ఓటరు జాబితా షెడ్యుల్ సవరణ నిర్వహించడం జరుగుతున్నదని, 18 ఏండ్లు నిండిన వారికి ఓటు హక్కు కల్పిస్తున్నామని తెలిపారు. ఈ జాబితాలో పేర్లు, పొలింగ్‌బూత్‌ల మార్పిడి, చనిపోయిన వారి ఓటర్ల తొలగింపు, వచ్చిన ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో విచారణ జరిపి వెంటనే సవరించాలని కలెక్టర్లను ఆదేశించారు. ఇప్పటివరకు కొత్త ఓటరు నమోదు, మార్పులు, చేర్పులకు వచ్చిన దరఖాస్తులు, వాటి పరిష్కారం దిశగా ఏమి చర్యలు తీసుకుంటున్నారో అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో స్వీప్ కార్యక్రమాలను అడిగి తెలుసుకున్న ఆమె జిల్లాలో ఇప్పటివరకు ఎన్ని కార్యక్రమాలు నిర్వహించారు, ఎంత మందికి అవగాహన కల్పించారు అని కలెక్టర్లను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో స్వీప్ కార్యక్రమాలను విజయవంతం చేయడం జరిగిందని కలెక్టర్లు ఆమె దృష్టికి తీసుకొచ్చారు. ఈ ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నిర్మల్, మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్లు ఆశీష్ సంగ్వాన్,సంతోష్, హేమంత్ బోర్కడే, అదనపు కలెక్టర్లు ఫైజన్ అహ్మద్, ఆర్డీవోలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఒక్క గుద్దుకు యువకుడు మృతి

- చాతిలో బలంగా కొట్టడంతో ఊపిరాడక మృత్యువాత
- ఇద్దరి స్నేహితుల మధ్య సరదా వైరం ఘర్షణకు దారి తీసింది..
- పుల్లుగా కల్లుతాగిన అనంతరం గుట్కా, రూ.10ల కోసం గొడవ
- కుభీర్ మండలంలోని పల్సిలో విషాదఛాయలు

యోగేశ్(ఫైల్)

కుభీర్, ఫిబ్రవరి 2 : నిర్మల్ జిల్లా కుభీర్ మండలంలోని పల్సి గ్రామానికి చెందిన పురంశెట్టి యోగేశ్, ఎల్.రమేశ్ మంచి స్నేహితులు. శుక్రవారం స్థానిక తెల్లకల్లు బట్టిలో పుల్లుగా కల్లు తాగి బయటకు వచ్చారు. సరదాగా యోగేశ్‌ను గుట్కా ఇవ్వమని రమేశ్ అడిగాడు. లేదనడంతో రూ.10లు అన్నా ఇవ్వమన్నాడు. ఇవ్వక పోవడంతో నీవ్వెప్పుడు ఇంతేరా.. ఒక్కసారైనా ఇవ్వవు.. అంటూ గద్దిస్తూ యోగేశ్‌పై రమేశ్ ఎగబడ్డాడు. దీంతో ఇద్దరి మధ్య మాటమాటా పెరిగి తీవ్ర గొడవకు దారి తీసింది. ఇంతలో రమేశ్ తన చేతితో యోగేశ్ చాతిలో బలంగా గుద్దడంతో ఊపిరి ఆడక కిందపడిపోయి పోయాడు. అక్కడున్న వారు పరుగున వచ్చి చూసే సరికి అప్పటికే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి వెళ్లి పంచనామా నిర్వహించారు. హత్య చేసిన రమేశ్‌ను అదుపులోకి తీసుకున్నారు. హత్యకు గురైన యోగేశ్ తండ్రి లింగన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై షరీఫ్ వివరించారు.

ప్రాణం పోస్తున్నారు..

- ప్రాణపాయ స్థితిలో ఉన్నవారికి సంజీవని
- ఇది నిర్మల్ ప్రభుత్వ దవాఖాన వైద్యుల ఘనత
- అరుదైన ఆపరేషన్లకు అడ్డాగా హాస్పిటల్
- విజయవంతంగా తుంటి, కీలు మార్పిడి సర్జరీలు
- పేగులు బయటపడిన వ్యక్తి ప్రాణాలు కాపాడిన డాక్టర్లు
- కేసీఆర్ ప్రభుత్వ హయాంలో సకల వసతులు
- కోట్లాది రూపాయలతో అత్యున్నతమైన పరికరాలు
- కార్పొరేట్‌కు దీటుగా వైద్య సేవలు

'వైద్యో నారాయణో హరి' అన్నారు పెద్దలు. నిజంగా ఈ వ్యాఖ్యం నిర్మల్ జిల్లా ప్రభుత్వ దవాఖాన వైద్యులకు అతికినట్టు సరిపోతున్నది. ప్రాణపాయ స్థితిలో ఉండి ఎవరు దవాఖానకు వచ్చినా ప్రాణం పోస్తున్నారు. ఎంతటి సీరియస్ కేసునైనా చాలెంజ్‌గా తీసుకుని చికిత్స అందిస్తున్నారు. ఆహోరాత్రులు శ్రమించి రోగులకు పునర్జన్మను ఇస్తున్నారు. కార్పొరేట్ హాస్పిటల్స్‌లో చేసే తుంటి, మోకీలు వంటి అరుదైన ఆపరేషన్లు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. నయాపైసా ఖర్చు లేకుండా ఆపరేషన్లు చేస్తూ నిరుపేదల పాలిట దేవుళ్లుగా మారుతున్నారు. రూ.లక్షల రూపాయల ఖర్చయ్యే వైద్యాన్ని ఉచితంగా అందిస్తున్నారు. ఇటీవల ఒక వ్యక్తి పేగులు బయటపడగా.. అతనికి మెరుగైన చికిత్స అందించి ప్రాణాలు కాపాడడమే నిదర్శనం.

నిర్మల్, ఫిబ్రవరి 2(నమస్తే తెలంగాణ) : నిర్మల్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి వైద్యులు కార్పొరేటుకు దీటుగా సేవలందిస్తూ మన్ననలను పొందుతున్నారు. గత కేసీఆర్ ప్రభుత్వం సర్కారు దవాఖానలను రూ.కోట్లు వెచ్చించి అధునాతన పరికరాలను సమకూర్చింది. భారీ సంఖ్యలో డాక్టర్ల నియామకాలను చేపట్టింది. పేద, మధ్య తరగతి వర్గాలకు మెరుగైన వైద్యాన్ని అందించడానికి మౌలిక సదుపాయాలను కల్పించింది. నిర్మల్‌లోని జిల్లా ప్రధాన ఆసుపత్రిలో అత్యవసర చికిత్సలను అందించడానికి అధునాతన పరికరాలను అందుబాటులోకి తెచ్చింది. క్రిటికల్ కేర్ యూనిట్‌తోపాటు డయాలసిస్ సెంటర్, సీటీ స్కాన్, డయాగ్నోసిస్ హబ్, వెంటిలేటర్, ఐసీయూ వంటి సౌకర్యాలను సమకూర్చడమే కాకుండా, స్పెషలిస్టు వైద్యులను నియమించింది. దీంతో జిల్లావాసులతోపాటు పక్క జిల్లాల్లోని బోథ్, నేరడిగొండ, మెట్‌పెల్లి, పోచంపాడ్, ముప్కాల్ ప్రాంతాల నుంచి రోగులు వస్తుంటారు. కాగా.. కొన్ని రోజుల నుంచి రోడ్డు ప్రమాదాల్లో తీవ్రంగా గాయపడి ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు ఊపిరి పోస్తున్నారు. దీంతోపాటు ప్రమాదాల్లో గాయపడి మృత్యువు సమీపంలోకి చేరుకున్న వారికి కూడా శస్త్రచికిత్సలు చేసి బతికిస్తున్నారు. కార్పొరేటు ఆసుపత్రుల్లో మాత్ర మే సాధ్యమయ్యే అరుదైన ఆపరేషన్లను సైతం విజయవంతంగా చేస్తూ ప్రజల విశ్వాసాన్ని చూరగొంటున్నారు.

- నిర్మల్ శివారులో నుంచి మామతో కలిసి బైక్‌పై వెళ్తున్న వెంకటేశ్‌పై గొడ్డలితో దాడి చేయగా కడుపులో నుంచి పేగులు బయటపడ్డాయి. ప్రాణాలపై ఆశలు వదులుకున్న బంధు మిత్రులు కొన ఊపిరితో ఉన్న వెంకటేశ్‌ను నిర్మల్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. హైదరాబాద్‌కు తరలించాల్సి ఉన్నప్పటికీ.. ఇక్కడి వైద్యులు కేసును చాలెంజ్‌గా తీసుకుని అత్యవసర చికిత్స అందించారు. ఆసుపత్రి వైద్యులు గణేశ్, రమ్య, పల్లవిలు గంటలపాటు శ్రమించి శస్త్రచికిత్సను విజయవంతంగా పూర్తి చేశారు. దీంతో వెంకటేశ్ ప్రాణాలు నిలిచాయి. ఇటీవలే దవాఖాన నుంచి డిశ్చార్జి కూడా అయ్యారు. దీంతో వైద్యులకు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి.
- మోకీలు, తుంటి కీలు మార్పిడి చేయాలంటే హైదరాబాద్ లాంటి మహానగరాల్లోని కార్పొరేటు దవాఖానల్లో సాధ్యమయ్యేది. అది కూడా అనుభవం ఉన్న వైద్యుల పర్యవేక్షణలోనే శస్త్రచికిత్సలను నిర్వహించేవారు. అయితే కేసీఆర్ ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ ప్రధాన దవాఖానలను కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా తయారు చేసింది. దీంతో చేతులు, కాళ్లు విరిగిన వారికి సర్జరీలు చేయడం సర్వ సాధారణం అయింది. నిర్మల్‌లోని ఆసుపత్రిలో మూడేళ్లుగా 20 మందికి పైగా మోకీలు మార్పిడి, ఐదుగురు తుంటి కీలు శస్త్రచికిత్సలు చేశారు.
- గత డిసెంబర్‌లో సోన్ మండలంలోని మాదాపూర్ గ్రామానికి చెందిన నర్సారెడ్డికి తుంటి ఎముక విరిగింది. ఇక్కడి ఆసుపత్రి ఎముకల వైద్య నిపుణులు శస్త్రచికిత్స నిర్వహించి తుంటి కీలు మార్పిడిని పూర్తి చేశారు. ప్రైవేటు ఆసుపత్రుల్లో రెండు లక్షలకు పైగా ఖర్చయ్యే ఈ ఆపరేషన్‌ను ఉచితంగా స్థానికంగానే చేశారు.

తుంటి కీలు మార్పిడి చేయించుకున్న నర్సారెడ్డి (ఫైల్)

ప్రభుత్వాసుపత్రిలో తుంటి కీలు మార్పిడి సర్జరీ చేస్తున్న వైద్యులు (ఫైల్)

అన్ని సదుపాయాలు ఉన్నాయి..

నిర్మల్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానలో అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయి. ముఖ్యంగా కార్పొరేటు ఆసుపత్రుల్లో మాత్రమే చేసే రీప్లేస్‌మెంట్ సర్జరీలు కూడా చేస్తున్నాం. ఇప్పటివరకు 20 మందికి మోకీలు మార్పిడి సర్జరీలు చేశాం. అలాగే ఐదుగురికి తుంటి ఎముక రీప్లేస్‌మెంట్ సర్జరీని విజయవంతంగా పూర్తి చేశాం. తుంటి ఎముక విరిగిన వారు, మోకాళ్ల నొప్పులతో బాధపడుతున్న వారు కూడా ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా మోకీలు మార్పిడి ఆపరేషన్లు చేయించుకోవచ్చు. ఇదే ప్రైవేటులో చేయించుకుంటే రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు ఖర్చవుతున్నది.

- డాక్టర్ లోక అరుణ్‌రెడ్డి, ఆర్థోపెడిక్ సర్జన్, జిల్లా ప్రధాన ఆసుపత్రి, నిర్మల్.

నిర్మల్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ప్రధాన దవాఖాన

తీవ్ర గాయాలైన వెంకటేశ్‌ను కాపాడిన వైద్యులు